RNI NO.TELTEL/2022/83842

# ప్రభాత గమనం

PRABHATA GAMANAM

తెలుగు దినపత్రిక

వరంగల్ | సంచిక 255 | సంపుటి 4 | మంగళవారం | 09-06-2026 | పేజీలు 4 | వెల 3/-

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

# హైదరాబాద్‌లో పేదలకు లక్ష ఇళ్లు..

- నగరంలోనే గృహాలు నిర్మించి లబ్ధిదారులకు కేటాయిస్తాం: సీఎం రేవంత్ రెడ్డి
- రూ.1,674 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం.. మియాపూర్ లో భారీ ప్రాజెక్టుల ప్రారంభం
- దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న ఆరు మహానగరాల్లో హైదరాబాద్ కు ప్రత్యేక గుర్తింపు
- కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు లేకుండా భవిష్యత్ నగరంగా హైదరాబాద్ రూపకల్పన
- పాలనా సమర్థత కోసమే మూడు మున్సిపల్ కార్పొరేషన్లు
- దేశ ఐటీ ఎగుమతుల్లో 16.77 శాతం సేవలు హైదరాబాద్ నుంచే
- గాజులరామారంలో వంద ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్ నిర్మాణం
- ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూముల స్వాధీనం.. గృహ నిర్మాణాలకు వినియోగం
- తెలంగాణ నుంచి 8 మంది ఎంపీలు గెలిచినా రాష్ట్రానికి కేంద్రం నుంచి ఏమి సాధించారు?
- మూసీ ప్రక్షాళన, సాగునీటి ప్రాజెక్టులకు సహకరించాలని బీజేపీ ఎంపీలకు సీఎం సూచన
- ప్రాజెక్టుల కోసం కేంద్రాన్ని ఒప్పిస్తే అడ్డుపడుతున్నారని కిషన్ రెడ్డిపై విమర్శలు
- రెండేళ్ల పాలనపై ప్రశ్నించే ముందు మీ పదేళ్ల పనితీరు చెప్పాలని బీజేపీకి సవాల్
- విశ్వనగరంగా హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన సీఎం


హైదరాబాద్ నగరంలో లక్ష ఇళ్లను నిర్మించి పేద, నిరుపేద కుటుంబాలకు కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. నగరంలో నివసిస్తున్న ప్రజలను శివారు ప్రాంతాలకు తరలించకుండా, వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల్లోనే గృహాలు నిర్మించి అందిస్తామని స్పష్టం చేశారు. దేశంలోని ప్రధాన మహానగరాలు కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ హైదరాబాద్ ను నివాసయోగ్యమైన, ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మాట్లాడిన సీఎం, నగర మౌలిక వసతుల విస్తరణ, పేదలకు గృహ భద్రత, రవాణా వ్యవస్థ బలోపేతం, ఐటీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. అదే సమయంలో తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల విషయంలో బీజేపీ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో విఫలమయ్యారని విమర్శించారు.

— హైదరాబాద్, ప్రభాత గమనం

## పేదల సొంతింటి కల సాకారం



2



## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

- ఉక్కు ద్రవం లీకై భారీ పేలుడు.. 9 మంది మృతి
- 1500 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉక్కు తరలిస్తుండగా ఘటన
- మృతుల్లో ఉద్యోగులు, ఒప్పంద కార్మికులు
- స్టీల్ ప్లాంట్ ఘటనపై దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతి

2

## రీల్స్ మోజు.. దొంగలకు క్లూ!

- ఒంటినిండా నగలు.. చేతిలో ఐఫోన్ తో వీడియోలు
- సోషల్ మీడియాలో ప్రదర్శన.. శుభకార్యానికి వెళ్లిన మహిళ
- అదే రోజు ఆమె ఇంట్లో భారీ చోరీ
- బంగారు ఆభరణాలతో పాటు రూ.2 లక్షల నగదు అపహరణ
- రీల్స్ లో కనిపించిన విలాసవంతమైన జీవనశైలిపై దొంగల కన్ను?
- సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత అవసరం : పోలీసులు

3

## వరంగల్ మహిళకు అరుదైన గౌరవం

- నేపాల్ లో జరిగే గ్రాస్ రూట్స్ అసెంబ్లీ-2026లో వక్తగా బండి మణెమ్మ ఎంపిక
- జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఘన సన్మానం
- తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న మణెమ్మకు అభినందనల వెల్లువ
- విజయవంతంగా ప్రసంగించి మరింత గుర్తింపు పొందాలని అభ్యుదయ సేవా సమితి ఆకాంక్ష



2

## మద్యంపై జయగిరి యుద్ధం..!

- మద్యపాన రహిత గ్రామంగా మారేందుకు మహత్తర సంకల్పం
- గ్రామసభ ఏకగ్రీవ తీర్మానం..
- అధికారుల, పోలీసు శాఖ, వైన్స్ యాజమాన్యం మద్దతుతో ముందుకు..



04



04



2

## వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీఆర్ లో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు ఇన్‌స్పెక్టర్లను వివిధ విభాగాలకు బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం కె. ప్రవీణ్ కుమార్‌ను హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు, జి. సుబ్బారెడ్డిని టాస్క్ ఫోర్స్‌కు, పి. దేవేందర్‌ను టాస్క్ ఫోర్స్‌కు, పి. దామోదర్ రెడ్డిని సీసీఆర్‌బీకు నియమించారు. చేరాలను వీఆర్‌లో కొనసాగిస్తూ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (టిటిఐ)కు అటాచ్ చేశారు. అలాగే ఓ. రమేష్‌ను పీసీఆర్ కు పోస్టింగ్ ఇచ్చి ఏహెచ్‌టీయూకు అటాచ్ చేయగా, ఏ. ప్రవీణ్ కుమార్‌ను ఐటీ కోర్ సెల్‌లో కొనసాగిస్తూ పీసీఆర్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ల అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## మృగశిర కార్తె సందడి

- చేపల కొనుగోలుకు ప్రజల బారులు
- భారీగా పలికిన చేపల ధరలు
- వ్యాధుల నివారణకు చేపలు తింటే మంచిదన్న నమ్మకంతో కొనుగోళ్లు
- కార్తె సందర్భంగా పెరిగిన డిమాండ్ తో కళకళలాడిన మార్కెట్

మృగశిర కార్తె సందర్భంగా కేసముద్రంలో చేపల మార్కెట్ సందడిగా మారింది. రుతుపవనాల రాకతో వచ్చే వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందనే విశ్వాసంతో ప్రజలు పెద్దఎత్తున చేపలను కొనుగోలు చేశారు. డిమాండ్ పెరగడంతో చేపల ధరలు సాధారణ రోజుల కంటే అధికంగా నమోదయ్యాయి.

# జూన్ 20న జాతీయ లోక్ అదాలత్

- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 20న నిర్వహించనున్న జాతీయ లాక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ కోరారు. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల పరిధిలోని క్రిమినల్, సివిల్, భూ తగాదాలు, మోటార్ ప్రమాదాల పరిహారం, బ్యాంకు, ఇన్సూరెన్స్ తదితర రాజీ పడదగిన కేసులను ఇరు పక్షాల అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం వేగవంతంగా జరిగి, సమయం, ధనం ఆదా అవుతాయని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పరస్పర అంగీకారంతో తమ వివాదాలను పరిష్కరించుకోవాలని సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు.

# ఆర్ఎస్ఐ కుమారస్వామికి సీపీ అభినందనలు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




పోలీసు శాఖలో అప్పగించిన విధులను అధికారులు సమర్థవంతంగా, నిబద్ధతతో నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. ఏఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఆర్ఎస్ఐగా పదోన్నతి పొందిన ఏ. కుమారస్వామి సోమవారం పోలీస్ కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సన్‌ప్రీత్ సింగ్ ఆయన భుజాలపై పదోన్నతి చిహ్నాలను అలంకరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, విధుల్లో ఎల్లప్పుడూ నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఉన్నతాధికారులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. పదోన్నతి పొందిన ఏ. కుమారస్వామికి ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.



# వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీఆర్ లో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు ఇన్‌స్పెక్టర్లను వివిధ విభాగాలకు బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం కె. ప్రవీణ్ కుమార్‌ను హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు, జి. సుబ్బారెడ్డిని టాస్క్ ఫోర్స్‌కు, పి. దేవేందర్‌ను టాస్క్ ఫోర్స్‌కు, పి. దామోదర్ రెడ్డిని సీసీఆర్‌బీకు నియమించారు. చేరాలను వీఆర్‌లో కొనసాగిస్తూ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (టిటిఐ)కు అటాచ్ చేశారు. అలాగే ఓ. రమేష్‌ను పీసీఆర్ కు పోస్టింగ్ ఇచ్చి ఏహెచ్‌టీయూకు అటాచ్ చేయగా, ఏ. ప్రవీణ్ కుమార్‌ను ఐటీ కోర్ సెల్‌లో కొనసాగిస్తూ పీసీఆర్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ల అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు..

## పేదల సొంతింటి కల సాకారం

- నగరంలోనే గృహాలు నిర్మించి లబ్ధిదారులకు కేటాయిస్తాం: సీఎం రేవంత్ రెడ్డి
- రూ.1,674 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం.. మియాపూర్ లో భారీ ప్రాజెక్టుల ప్రారంభం
- దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న ఆరు మహానగరాల్లో హైదరాబాద్ కు ప్రత్యేక గుర్తింపు
- కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు లేకుండా భవిష్యత్ నగరంగా హైదరాబాద్ రూపకల్పన
- పాలనా సమర్థత కోసమే మూడు మున్సిపల్ కార్పొరేషన్లు
- దేశ ఐటీ ఎగుమతుల్లో 16.77 శాతం సేవలు హైదరాబాద్ నుంచే
- గాజులరామారంలో వంద ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్ నిర్మాణం
- ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూముల స్వాధీనం.. గృహ నిర్మాణాలకు వినియోగం
- తెలంగాణ నుంచి 8 మంది ఎంపీలు గెలిచినా రాష్ట్రానికి కేంద్రం నుంచి ఏమి సాధించారు?
- మూసీ ప్రక్షాళన, సాగునీటి ప్రాజెక్టులకు సహకరించాలని బీజేపీ ఎంపీలకు సీఎం సూచన
- ప్రాజెక్టుల కోసం కేంద్రాన్ని ఒప్పిస్తే అడ్డుపడుతున్నారని కిషన్ రెడ్డిపై విమర్శలు
- రెండేళ్ల పాలనపై ప్రశ్నించే ముందు మీ పదేళ్ల పనితీరు చెప్పాలని బీజేపీకి సవాల్
- విశ్వనగరంగా హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన సీఎం



**ప్రభాత గమనం, హైదరాబాద్:**

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన, నివాసానికి అనువైన మహానగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్న ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ఆరు మహానగరాల్లో హైదరాబాద్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. మియాపూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన సీఎం, దేశంలోని ఇతర ప్రధాన నగరాలు కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఢిల్లీలో కాలుష్యం తీవ్ర స్థాయికి చేరి పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేసే పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. అయితే హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిపుణులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, నగర విస్తరణ, జనాభా పెరుగుదల, ట్రాఫిక్ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, మౌలిక వసతుల అభివృద్ధి అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు.

### మూడు కార్పొరేషన్లతో మెరుగైన పాలన

పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా పాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించామని సీఎం తెలిపారు. ప్రజలకు సేవలు వేగంగా అందించడంతో పాటు అభివృద్ధి పనుల అమలులో జాప్యాలు తగ్గించడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమన్నారు. సైబరాబాద్ ప్రాంతం దేశ ఐటీ రంగానికి ప్రధాన కేంద్రంగా మారిందని, దేశ ఐటీ ఎగుమతుల్లో 16.77 శాతం వాటా హైదరాబాద్ నుంచే వస్తోందని వెల్లడించారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఐటీ సంస్థలు హైదరాబాద్‌ను పెట్టుబడుల కేంద్రంగా ఎంచుకోవడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు.

### రూ.1,674 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

హైదరాబాద్ నగర మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడానికి రూ.1,674.74 కోట్లతో పలు కీలక ప్రాజెక్టులను ప్రారంభించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనం నిర్మాణంతో పాటు మియాపూర్‌లో ద్విముఖ ఫ్లైఓవర్, రెండు అండర్‌పాస్‌లు, మియాపూర్ నుంచి ఆల్విన్ ఎక్స్ రోడ్డు వరకు ఆరు లైన్ల ఫ్లైఓవర్, శేరిలింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుందని సీఎం పేర్కొన్నారు.

### పేదలకు లక్ష ఇళ్లు

హైదరాబాద్ నగరంలో లక్ష ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు సీఎం ప్రకటించారు. నగరంలోని పేద కుటుంబాలకు గృహ భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఏ ప్రాంతానికి చెందిన లబ్ధిదారులకైనా అదే ప్రాంతంలో ఇల్లు కట్టించి ఇవ్వాలని నిర్ణయించామని, పేదలను నగర శివార్లకు తరలించే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నామని, ఆ భూములను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగిస్తామని తెలిపారు. గృహ నిర్మాణానికి అవసరమైన భూముల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

### బీజేపీ ఎంపీలపై విమర్శలు

తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను ప్రజలు గెలిపించారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం వారు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత ఉందని సీఎం అన్నారు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన మద్దతుకు ప్రతిఫలంగా రాష్ట్రానికి ఏమి సాధించారో బీజేపీ ఎంపీలు చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ నది ప్రక్షాళన, ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు, కేంద్ర నిధుల కేటాయింపు వంటి కీలక అంశాల్లో రాష్ట్రానికి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకురావడంలో బీజేపీ నాయకులు విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్రానికి రావాల్సిన పలు ప్రాజెక్టుల విషయంలో అడ్డంకులు సృష్టిస్తున్నారని సీఎం ఆరోపించారు. తాను ఢిల్లీలో ప్రధానమంత్రి, కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు సాధించే ప్రయత్నం చేస్తే ఆ తరువాత వాటిని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. తాను కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేస్తున్నప్పటికీ రాజకీయ కారణాలతో కొందరు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు.

### ఆర్టీసీకి మహాలక్ష్మి పథకం అండ

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకానికి ఇప్పటివరకు రూ.10 వేల కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లించిందని సీఎం తెలిపారు. మహిళా సంఘాలకు వెయ్యి బస్సులను కొనుగోలు చేసి అందించామని చెప్పారు. గతంలో నష్టాల్లో ఉన్న తెలంగాణ ఆర్టీసీ ప్రస్తుతం మహాలక్ష్మి పథకం కారణంగా ప్రయాణికుల సంఖ్య పెరిగి లాభాల బాటలో పయనిస్తోందని పేర్కొన్నారు.

### విశ్వనగరంగా హైదరాబాద్

గాజులరామారంలో వంద ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్ నిర్మాణం చేపడుతున్నట్లు ప్రకటించిన సీఎం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రోడ్లు, రవాణా, తాగునీరు, మురుగునీటి వ్యవస్థలు, ఐటీ మౌలిక వసతులను మరింత విస్తరిస్తామని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల సరసన నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

- ఉక్కు ద్రవం లీకై భారీ పేలుడు.. 9 మంది మృతి
- 1500 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉక్కు తరలిస్తుండగా ఘటన
- మృతుల్లో ఉద్యోగులు, ఒప్పంద కార్మికులు
- స్టీల్ ప్లాంట్ ఘటనపై దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతి

**ప్రభాత గమనం, విశాఖపట్నం:**

రాష్ట్రీయ ఇస్పత్ నిగమ్ లిమిటెడ్ లో సోమవారం సంభవించిన ఘోర ప్రమాదం కార్మిక వర్గాన్ని విషాదంలో ముంచెత్తింది. స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్–2 విభాగం పరిధిలో ఉన్న ఎస్‌టీసీ–3 హీట్ ఫెసిలిటీలో ఉక్కు ద్రవాన్ని తరలిస్తున్న సమయంలో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ ఒక్కసారిగా పేలినట్లు సమాచారం. దీంతో సుమారు 1500 డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన ఉక్కు ద్రవం బయటకు చిమ్మి భారీ మంటలు వ్యాపించాయి. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న కార్మికులు ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీశారు. అయితే మంటలు, ఉక్కు ద్రవం ధాటికి 9 మంది అక్కడికక్కడే మృతిచెందినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పలువురు గాయపడగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

### మృతుల్లో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు

ప్రమాదంలో అప్పారావు, కృష్ణ, ప్రభాకర్ రావు, అప్పలరాజు, త్రినాథ్, రమణ, కుమార్ మృతిచెందినట్లు అధికారులు గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుల్లో ఐదుగురు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు కాగా, ముగ్గురు కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్నట్లు సమాచారం. రావూరి మల్లికార్జునరావు, అర్జున అప్పారావు, సూరిబాబు, పల్లెల శ్రీనివాస్, సత్యనంద్, పైడిరాజు తదితరులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. ల్యాడిల్ పేలడానికి సాంకేతిక లోపాలే కారణమా? లేక నిర్వహణలో ఏవైనా తప్పిదాలు జరిగాయా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

# వరంగల్ మహిళకు అరుదైన గౌరవం

- నేపాల్ లో జరిగే గ్రాస్ రూట్స్ అసెంబ్లీ-2026లో వక్తగా బండి మణెమ్మ ఎంపిక
- జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఘన సన్మానం
- నీరు, పారిశుధ్యరంగ అనుభవాలను అంతర్జాతీయ వేదికపై పంచుకోనున్న కమ్యూనిటీ నాయకురాలు
- తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న మణెమ్మకు అభినందనలు వెల్లువ
- విజయవంతంగా ప్రసంగించి మరింత గుర్తింపు పొందాలని అభ్యుదయ సేవా సమితి ఆకాంక్ష



**హనుమకొండ, జూన్ 8 (ప్రభాత గమనం):**

అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఖాజీపేటకు చెందిన ప్రముఖ కమ్యూనిటీ నాయకురాలు బండి మణెమ్మకు అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట గౌరవం దక్కింది. దక్షిణాసియా దేశాల్లో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత (WASH) రంగాల్లో పనిచేస్తున్న ఫ్రెష్ వాటర్ యాక్షన్ నెట్ వర్క్ సౌత్ ఏషియా ఆధ్వర్యంలో జూన్ 12, 13 తేదీలలో నేపాల్ రాజధాని ఖట్మండ్ లో నిర్వహించనున్న గ్రాస్ రూట్స్ అసెంబ్లీ–2026 సమావేశంలో వక్తగా పాల్గొనడానికి ఆమెకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో బండి మానెమ్మను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ రాజారెడ్డి, ఫాన్సా తెలంగాణ రాష్ట్ర చాప్టర్ కన్వీనర్ మండల పరశురాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సెప్టిక్ ట్యాంక్ డీ–స్లడ్జింగ్ కార్యక్రమంలో కమ్యూనిటీ భాగస్వామ్యంతో సాధించిన విజయవంతమైన అనుభవాలను దక్షిణాసియా దేశాల ప్రతినిధులతో పంచుకోవాలని సూచించారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ రాష్ట్రం తరఫున మాట్లాడే అవకాశం రావడం గర్వకారణమని పేర్కొన్నారు. “Be Seen, Be Heard, Lead Change” అనే ప్రధాన నినాదంతో నిర్వహిస్తున్న గ్రాస్‌రూట్స్ అసెంబ్లీ–2026లో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సామాజిక సమానత్వం, కమ్యూనిటీ హక్కులు, ప్రజల ఆధారిత అభివృద్ధి నమూనాలపై చర్చలు జరగనున్నాయి. సమాజాలు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, అంతర్జాతీయ అభివృద్ధి భాగస్వాములు, పరిశోధకులు, విధాన నిర్ణేతల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం ఈ సమావేశం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. దక్షిణాసియా స్థాయి వేదికపై తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా వరంగల్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బండి మానెమ్మ విజయవంతంగా ప్రసంగించి మరింత గుర్తింపు పొందాలని అభ్యుదయ సేవా సమితి ఆకాంక్షించింది. ఈ సందర్భంగా FANSA తెలంగాణ రాష్ట్ర చాప్టర్ కన్వీనర్, అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు మండల పరశురాములు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



# తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన

- పాఠశాలలను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హనుమకొండ, జూన్ 8(ప్రభాత గమనం) :**

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం అనువైన ప్రభుత్వ పాఠశాలలను గుర్తించే ప్రక్రియలో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సోమవారం కాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జీహెచ్ఎస్), శాయంపేట జాగీర్ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల విస్తీర్ణం, మౌలిక వసతులు, తరగతి గదులు, క్రీడా మైదానాలు, విద్యార్థుల సంఖ్య, భవిష్యత్ విస్తరణకు ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో విద్యా అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి విద్యార్థుల్లో ప్రతిభ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ లక్ష్యమని, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు విద్యారంగంలో నూతన మార్పులకు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, తహశీల్దార్ రాజు, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఎంఈఓ మనోజ్ కుమార్, విద్యాశాఖ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఫెయిల్

## రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలపై నిరంతర దాడులు : ఖర్గే

- ఉద్యోగాలు లేవు.. పెట్టుబడులు రావడం లేదు.. ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉందని విమర్శ
- కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ కక్షసాధింపులకు ఉపయోగిస్తున్నారని ఆరోపణ
- బీజేపీయేతర రాష్ట్రాలపై వివక్ష.. ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని మండిపాటు
- దేశాన్ని కాపాడేందుకు ఇండియా కూటమి మరింత బలపడాల్సిన అవసరం ఉందని పిలుపు

హైదరాబాద్, జూన్ 8 (ప్రభాత గమనం):

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేళ్ల పాలనలో దేశాన్ని పలు రంగాల్లో వెనక్కి నెట్టిందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ రంగాల్లో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్షాలపై రాజకీయ దాడులు చేయడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో ఆదివారం జరిగిన ఇండియా కూటమి కీలక సమావేశంలో మాట్లాడిన ఖర్గే, దేశ రాజ్యాంగంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ సంస్థలను బలహీనపరచడం, స్వతంత్ర వ్యవస్థలపై ఒత్తిడి పెంచడం, ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీయడం వంటి చర్యలు దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం బీజేపీయేతర రాష్ట్రాల పట్ల వివక్షపూరిత వైఖరిని అవలంబిస్తోందని ఖర్గే ఆరోపించారు. రాష్ట్రాలకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, పరిపాలనా సహకారం విషయంలో రాజకీయ ప్రమాణాలను అనుసరిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవించకుండా ప్రతిపక్ష ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.



దేశ ఆర్థిక పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారిందని ఖర్గే అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన సమయంలో ఉద్యోగాల సృష్టి మందగించిందని, పరిశ్రమలకు అవసరమైన పెట్టుబడులు ఆశించిన స్థాయిలో రావడం లేదని చెప్పారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, కొద్ది మంది కార్పొరేట్ సంస్థల చేతుల్లోనే ఆర్థిక వ్యవస్థ కేంద్రీకృతమవుతోందని ఆరోపించారు. ఎంఎస్ఎంఈ రంగం సంక్షోభంలో చిక్కుకుపోయిందని, లక్షలాది మంది చిన్న వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు నష్టాలను చవిచూస్తున్నారని తెలిపారు. మరోవైపు నిరుద్యోగ సమస్య రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం దానిపై సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. యువత భవిష్యత్తుతో కూడా ప్రభుత్వం ఆటలాడుతోందని ఖర్గే మండిపడ్డారు. పోటీ పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, నియామకాల్లో జాప్యాల కారణంగా యువత తీవ్ర నిరాశకు గురవుతోందని అన్నారు. దేశ భవిష్యత్తును నిర్మించే యువతను నిర్లక్ష్యం చేయడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ పేరుతో లక్షలాది మంది ఓటర్ల హక్కులను హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఖర్గే ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, దానిని కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని స్పష్టం చేశారు. ఇండియా కూటమి ఏర్పడి మూడేళ్లు పూర్తయిందని గుర్తుచేసిన ఖర్గే, పార్లమెంటులో ఇటీవల ప్రతిపక్షాల ఐక్యత ప్రభావాన్ని అధికార పక్షం ప్రత్యక్షంగా చూసిందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల సంరక్షణ, దేశ సమస్యల పరిష్కారం కోసం ఇండియా కూటమి మరింత బలంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ, ఎన్సీపీ నాయకురాలు సుప్రియా సూలే తదితరులు హాజరయ్యారు. మొత్తం 23 ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు పాల్గొని దేశ రాజకీయ పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. అయితే కూటమిలోని కీలక భాగస్వామ్య పార్టీలైన డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ సమావేశానికి దూరంగా ఉండడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# అన్నదాతకు తప్పని అరణ్యరోదన

- సన్నధాన్యం బోనస్ పైసలపై సర్కార్ తాత్సారం
- ముగిసిన యాసంగి కొనుగోళ్లు.. ఇంకా అందని రూ. 700 కోట్ల బోనస్ డబ్బులు
- గత సీజన్ బకాయిలు రూ. 1,159 కోట్లు సైతం ఎగవేత?
- నిధులు లేక చేతులెత్తేసిన సివిల్ సప్లయిస్ శాఖ..
- ఆందోళనలో తెలంగాణ రైతాంగం
- తక్షణమే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలి :బీఆర్ఎస్ నేత శీలంశెట్టి రమేష్ డిమాండ్

గార్ల, జూన్ 08 (ప్రభాత గమనం) :




తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కి, అన్నదాతలను తీవ్రంగా వంచిస్తోందని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్భాటంగా ప్రకటనలు చేయడమే తప్ప, క్షేత్రస్థాయిలో రైతులకు పైసా సాయం అందడం లేదని, యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసినా సన్నధాన్యం పండించిన రైతులకు ఇంతవరకు అదనపు బోనస్ సొమ్ము విడుదల కాకపోవడమే ఇందుకు నిదర్శనమని విపక్షాలు, రైతు సంఘాలు మండిపడుతున్నాయి.ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 73 లక్షల టన్నుల ధాన్యం సేకరించినట్లు ప్రభుత్వం చెబుతోంది. ఇందులో దాదాపు 14 లక్షల టన్నుల వరకు సన్నధాన్యం సేకరించినట్లు అంచనా. ఎన్నికల హామీ ప్రకారం సన్నధాన్యానికి క్వింటాల్‌కు (టన్నుకు రూ. 5,000 చొప్పున) బోనస్ కింద రైతులకు రూ. 700 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అయితే, కొనుగోళ్లు పూర్తయి రోజులు గడుస్తున్నా, ఇంతవరకు ఏ ఒక్క రైతు ఖాతాలోనూ ఈ బోనస్ సొమ్ము జమ కాకపోవడం గమనార్హం.ప్రస్తుత సీజన్ బకాయిలు ఇలా ఉంటే.. గత యాసంగి సీజన్ లో దాదాపు 4 లక్షల మంది రైతుల నుండి సేకరించిన 23.19 లక్షల టన్నుల సన్నధాన్యానికి సంబంధించిన బోనస్ నిధులు రూ. 1,159.64 కోట్లను ప్రభుత్వం ఏడాది గడుస్తున్నా విడుదల చేయలేదు. దీంతో ప్రభుత్వం నిలువునా తమను ముంచుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ధాన్యానికి సంబంధించిన కనీస మద్దతు ధర (MSP) నిధులను సివిల్ సప్లై కార్పొరేషన్ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని రైతులకు చెల్లిస్తున్నప్పటికీ.. బోనస్ నిధులను మాత్రం ప్రభుత్వం బడ్జెట్ నుంచి నేరుగా విడుదల చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి పౌరసరఫరాల శాఖ నుంచి నిధుల కేటాయింపు ఫైల్ ప్రభుత్వానికి చేరినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేస్తోందని తెలుస్తోంది. "సర్కార్ నుంచి నిధులు వస్తేనే మేము ఏమైనా చేయగలం" అంటూ అధికారులు చేతులెత్తేస్తుండటం గమనార్హం.ప్రస్తుతం వానాకాలం సాగు పనులు మొదలవుతున్నా.. గత యాసంగికి సంబంధించి బకాయి ఉన్న మూడో విడత 'రైతుభరోసా' పెట్టుబడి సాయంతో పాటు, ధాన్యం బోనస్ పైసల విషయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత రావడం లేదు. ఒక సీజన్ లో బోనస్ ఇస్తూ, మరో సీజన్ లో ఎగ్గొట్టడం ఈ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని, ఈసారి కూడా తమకు రావలసిన డబ్బులు ఎగవేస్తారేమోనని రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది."గత ఏడాది పెండింగ్ లో ఉన్న బోనస్ బకాయిలతో పాటు, ఈ రబి (యాసంగి) సీజన్ కు సంబంధించిన సన్నధాన్యం బోనస్ డబ్బులను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలి. మాటల ప్రభుత్వంగా మారిన కాంగ్రెస్.. ఇప్పటికైనా అన్నదాతలను ఆదుకునేలా చర్యలు చేపట్టాలి."

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బయ్యారం, జూన్ 8 (ప్రభాత గమనం) :

ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయనిధి బాధితులకు కొండంత అండగా నిలుస్తోందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం బయ్యారంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా, జగ్గుతండా గ్రామపంచాయతీకి చెందిన బాధితులు మూడ్ రమేష్‌కు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని, దీనిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో ఎవరికి ఎటువంటి ఆపద వచ్చినా తమ వంతు సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బయ్యారం సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవతోనే నియోజకవర్గంలోని పలువురు బాధితులకు ప్రభుత్వ సాయం అందుతోందని కొనియాడారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి వెంకటపతి, జగ్గుతండా మాజీ సర్పంచ్ బోడ రమేష్, బయ్యారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## నిత్యావసర ధరలపై

# సీపీఐ సమరశంఖం

- జూన్ 10న జిల్లా కలెక్టరేట్ ముట్టడికి పిలుపు
- ధరల పెరుగుదలతో ప్రజలు అల్లాడుతున్నారు: కట్టేబోయిన శ్రీనివాస్
- సామాన్యుల పక్షాన పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపు

గార్ల, జూన్ 8 (ప్రభాత గమనం):

దేశంలో, రాష్ట్రంలో నానాటికీ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలపై కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) సమరశంఖం పూరించింది. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని, దీనికి నిరసనగా ఈ నెల 10వ తేదీన జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పార్టీ ప్రకటించింది.సోమవారం గార్ల మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టేబోయిన శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, రాబోయే ఆందోళన కార్యక్రమాలకు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కట్టేబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ, పాలకుల తప్పుడు ఆర్థిక విధానాల వల్ల నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని మండిపడ్డారు. పేద, మధ్యతరగతి కుటుంబాల జీవనం పూర్తిగా దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ధరలను అదుపు చేయాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహాన్ని చవిచూడక తప్పదని హెచ్చరించారు."ఈ పోరాటం కేవలం సిపిఐ పార్టీది మాత్రమే కాదు.. ధరల పెరుగుదలతో అల్లాడిపోతున్న ప్రతి సామాన్య పౌరుడిది."ధరల నియంత్రణే ధ్యేయంగా ఈ నెల 10న నిర్వహించ తలపెట్టిన జిల్లా కలెక్టరేట్ ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ముట్టడి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న సామాన్య ప్రజలు, కార్మికులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యకర్తల సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, సహాయ కార్యదర్శి రాగం రమేష్‌లతో పాటు ముఖ్య నాయకులు భూక్యా హరినాయక్, ధూపాటి జనార్ధన్, సింగు రమేష్, మాగం లోకేష్, రాజేష్, శ్రీను తదితర పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.





# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- హామీలన్నింటినీ తు.చ తప్పకుండా అమలు చేస్తాం
- పెద్ద కిష్టాపురంలో గ్రామసభలో ఎమ్మెల్యే కోరం కనకయ్య
- గార్లలో జీలుగు విత్తనాలు, కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ

గార్ల, జూన్ 08 (ప్రభాత గమనం) :

రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, సింగిల్ విండో చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్ర పరిధిలోని పెద్ద కిష్టాపురం గ్రామపంచాయతీలో సర్పంచ్ గంగావత్ రాంసింగ్ అధ్యక్షతన సోమవారం ఘనంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు ఎమ్మెల్యే కోరం కనకయ్య, సింగిల్ విండో చైర్మన్ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై, రైతులకు సబ్సిడీ జీలుగు విత్తనాలను, లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి మరియు సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం సరఫరా వంటి పథకాలు ఇప్పటికే విజయవంతంగా నడుస్తున్నాయని, త్వరలోనే అర్హులకు కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, పెంచిన పింఛన్లను అందజేస్తామని హామీ ఇచ్చారు.రైతులకు జీలుగు విత్తనాలను అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ.. జీలుగు సాగు ద్వారా భూమి సారం పెరగడమే కాకుండా, పంట దిగుబడులు అద్భుతంగా వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారని, దీనిని రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు.అనంతరం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని కొనియాడారు. అలాగే ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో సీఎంఆర్ఎఫ్ పేదలకు కొండంత అండగా నిలుస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద కిష్టాపురం సర్పంచ్ గంగావత్ రామ్ సింగ్ తో పాటు పరిసర గ్రామాల సర్పంచులు పార్వతి హత్తిరం, వీరభద్రం, బానోత్ మోతిలాల్, వీర్య, భూక్యా రాంసింగ్, వీరన్న, వెంకట్రాం, జాటోత్ ఉమాదేవి పాల్గొన్నారు. అలాగే ఉపసర్పంచులు మహమ్మద్ జరీనా బేగం, యార్లగడ్డ శ్రీనివాస్, శివకృష్ణ, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ గౌడ్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శంషాద్ బేగం, స్థానిక కాంగ్రెస్ మరియు యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. వీరితో పాటు తహసీల్దార్ (ఎమ్మార్వో), ఎంపీడీవో, వ్యవసాయ అధికారులు, పంచాయతీ సెక్రెటరీలు, లబ్ధిదారులు, రైతులు పాల్గొన్నారు.

# పోలీస్ VS ప్రెస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

- హోరాహోరీ పోరులో పోలీస్ జట్టు ఘన విజయం
- అద్భుత హాఫ్ సెంచరీతో రాణించిన గార్ల ఎస్సై సాయికుమార్
- ఆల్ రౌండ్ ప్రతిభతో ఆకట్టుకున్న బయ్యారం సీఐ రవీందర్
- రెండు శాఖల మధ్య స్నేహభావం పెంచడమే లక్ష్యం: సీఐ రవీందర్

గార్ల , జూన్ 08 (ప్రభాత గమనం ) :

పోలీస్, ప్రెస్ (మీడియా) శాఖల మధ్య స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో గార్ల మర్రిగూడెం గ్రౌండ్‌లో నిర్వహించిన స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌లో పోలీస్ జట్టు ఘన విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్ ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పోలీస్ జట్టు నిర్ణీత ఓవర్లలో 107 పరుగులు చేసింది. పోలీస్ జట్టులో గార్ల ఎస్సై సాయికుమార్ అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శనతో క్రీజులో అదరగొట్టారు. కేవలం కొద్ది బంతుల్లోనే 52 పరుగులు చేసి హాఫ్ సెంచరీ సాధించడమే కాకుండా, జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించారు.అనంతరం 108 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ప్రెస్ (మీడియా) జట్టు.. పోలీస్ బౌలర్ల ధాటికి ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయింది. వరుస వికెట్లు కోల్పోతూ 87 పరుగులకే ఆల్ అవుట్ అయ్యింది. దీంతో పోలీస్ జట్టు 20 పరుగుల తేడాతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది.ఈ మ్యాచ్‌లో బయ్యారం సీఐ రవీందర్ బ్యాటింగ్ మరియు బౌలింగ్ రెండింటిలోనూ సమగ్రమైన ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఆయన ప్రతిభను మీడియా మిత్రులు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే అద్భుత ఇన్నింగ్స్ ఆడిన గార్ల ఎస్సై సాయికుమార్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.ఈ సందర్భంగా బయ్యారం సీఐ రవీందర్ మాట్లాడుతూ.. "ఇలాంటి ఆటల్లో గెలుపోటములు ముఖ్యం కాదు. నిరంతరం విధులతో ఒత్తిడిలో ఉండే పోలీస్, ప్రెస్ శాఖల మధ్య స్నేహం, సమన్వయం మరియు పరస్పర అవగాహన పెరగడమే ఈ మ్యాచ్ యొక్క ముఖ్య ఉద్దేశం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, జర్నలిస్టులు మరియు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటగాళ్లను ఉత్సాహపరిచారు.



# రీల్స్ మోజు.. దొంగలకు క్లూ!

- ఒంటినిండా నగలు.. చేతిలో ఐఫోన్ తో వీడియోలు
- అదే రోజు ఆమె ఇంట్లో భారీ చోరీ
- రీల్స్‌లో కనిపించిన విలాసవంతమైన జీవనశైలిపై దొంగల కన్ను?
- సోషల్ మీడియాలో ప్రదర్శన.. శుభకార్యానికి వెళ్లిన మహిళ
- బంగారు ఆభరణాలతో పాటు రూ.2 లక్షల నగదు అపహరణ
- సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత అవసరం : పోలీసులు

హైదరాబాద్, జూన్ 8 (ప్రభాత గమనం):



సోషల్ మీడియా ఎంత ఉపయోగకరమో, నిర్లక్ష్యంగా వాడితే అంతే ప్రమాదకరమని మరోసారి రుజువైంది. రీల్స్ కోసం తన విలాసవంతమైన జీవనశైలిని ప్రదర్శించిన ఓ మహిళ చివరకు దొంగల బారిన పడిన ఘటన మధ్యప్రదేశ్‌లో వెలుగుచూసింది. మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా జిల్లా పరిధిలోని ఓ గ్రామానికి చెందిన రచన గుజ్జార్‌కు సోషల్ మీడియాలో రీల్స్ చేయడం అలవాటు. ఖరీదైన చీరలు, బంగారు నగలు ధరించి, చేతిలో ఐఫోన్ పట్టుకుని తరచూ వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేసేది. ఆమె వీడియోలకు మంచి స్పందన రావడంతో మరింతగా అలాంటి కంటెంట్‌ను పంచుకుంటూ ఉండేది. మూడు రోజుల క్రితం కూడా కొత్త నగలు ధరించి రీల్ రూపొందించి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసింది. అదే రోజు రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఓ కార్యక్రమానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి షాక్‌కు గురైంది. ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు బంగారు నగలతో పాటు నగదు రూ.2 లక్షలు అపహరించారు. తన సోషల్ మీడియా పోస్టుల ద్వారా ఇంట్లో విలువైన వస్తువులు ఉన్నాయన్న సమాచారం దొంగలకు చేరి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రభాత గమనం
వరంగల్, మంగళవారం, 08-06-2026



# మృగశిర కార్తె సందడి

- చేపల కొనుగోలుకు ప్రజల బారులు
- భారీగా పలికిన చేపల ధరలు
- వ్యాధుల నివారణకు చేపలు తింటే మంచిదన్న నమ్మకంతో కొనుగోళ్లు
- కార్తె సందర్భంగా పెరిగిన డిమాండ్ తో కళకళలాడిన మార్కెట్

**కేసముద్రం, జూన్ 8 (ప్రభాత గమనం):**

మృగశిర కార్తె సందర్భంగా కేసముద్రం పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో చేపల కొనుగోళ్లు జోరుగా సాగాయి. ప్రతి ఏడాది మృగశిర కార్తె రోజున చేపలు తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుందనే నమ్మకం ప్రజల్లో ఉండటంతో ఉదయం నుంచే చేపల మార్కెట్ల వద్ద రద్దీ నెలకొంది. రుతుపవనాల ప్రారంభ సమయంలో చేపలు తింటే శరీరానికి అవసరమైన పోషకాలు అందడంతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ప్రజలు విశ్వసిస్తుంటారు. ఈ సంప్రదాయాన్ని అనుసరిస్తూ చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రజలు చేపల కొనుగోలుకు ఆసక్తి చూపారు. డిమాండ్ పెరగడంతో మార్కెట్లో చేపల ధరలు కూడా కాస్త పెరిగాయి. కిలో చేపలు రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయించబడినట్లు వ్యాపారులు తెలిపారు. సాధారణ రోజులతో పోలిస్తే ధరలు అధికంగా ఉన్నప్పటికీ కొనుగోళ్లలో ఎలాంటి తగ్గుదల కనిపించలేదన్నారు. మృగశిర కార్తె సందర్భంగా చేపల విక్రయాలు ఆశాజనకంగా సాగాయని, ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారం బాగా జరిగిందని చేపల వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు. దీంతో కేసముద్రం చేపల మార్కెట్ రోజు మొత్తం సందడిగా కనిపించింది.



## కురవి పెద్ద చెరువులో చేపల లూటీ

మహబూబాబాద్ జిల్లా కురవి పెద్ద చెరువులో చేపల లూటీ జరిగింది. సోమవారం మృగశిర కార్తె సందర్భంగా మండలంలోని పలు గ్రామాలతో పాటు, సమీప తండాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి చెరువులో చేపల వేటకు దిగారు. వలలు వేసి పెద్ద ఎత్తున చేపలు పట్టుకెళ్లారు. విషయం తెలుసుకున్న సొసైటీ సభ్యులు చెరువు వద్దకు చేరుకొని సుమారు 60 ద్విచక్ర వాహనాలను, వలలు లాక్కొని వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమంగా చెరువులో చేపల వేటకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ అంజలి హెచ్చరించారు.



# మద్యంపై జయగిరి యుద్ధం..!

- మద్యపాన రహిత గ్రామంగా మారేందుకు మహత్తర సంకల్పం
- గ్రామసభ ఏకగ్రీవ తీర్మానం..
- అధికారుల, పోలీసు శాఖ, వైన్స్ యాజమాన్యం మద్దతుతో ముందుకు..

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని జయగిరి గ్రామాన్ని సంపూర్ణ మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా ముందుకు సాగుతున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న నిర్వహించిన గ్రామసభలో మద్యపాన నిషేధంపై ఏకగ్రీవ తీర్మానం ఆమోదించడంతో ఈ దిశగా చర్యలు వేగవంతమయ్యాయి. గ్రామ యువత భవిష్యత్తు, కుటుంబాల సంక్షేమం, మహిళల భద్రత, సామాజిక శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో మద్యపానాన్ని పూర్తిగా నిరోధించాలని గ్రామసభ నిర్ణయించింది. ఈ తీర్మానాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన సహకారం కోరుతూ జయగిరి గ్రామ సర్పంచ్ తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామ ప్రతినిధుల బృందం సంబంధిత శాఖల అధికారులు, తెలంగాణ వైన్స్ యాజమాన్యాన్ని కలిసి వినతిపత్రాలు సమర్పించింది. తెలంగాణ వైన్స్ యాజమాన్యాన్ని కలిసి గ్రామంలో మద్యపాన నిషేధ తీర్మానం అమలుకు సహకరించాలని కోరగా, జయగిరిని మద్యపాన నిషేధిత గ్రామంగా తీర్చిదిద్దే ప్రయత్నాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని వారు హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు తీసుకున్న ఈ నిర్ణయం సమాజానికి ఆదర్శప్రాయంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. అనంతరం కాజీపేట ఏసీపీ పింగళి ప్రశాంత్ రెడ్డిని కలిసి గ్రామసభ తీర్మానం అమలుకు పోలీసు శాఖ సహకారం అందించాలని కోరగా, గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా మద్యపాన నిషేధానికి ముందుకు రావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. జయగిరిని మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సహకారం, సూచనలు అందిస్తామని హామీ ఇచ్చారు. తదుపరి హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేయగా, గ్రామంలో మద్యపాన నియంత్రణ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు పోలీసు శాఖ అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ



సందర్భంగా సర్పంచ్ తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గ్రామంలో మద్యపాన నిర్మూలన ద్వారా యువతను చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచడం, కుటుంబాల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం, ఆరోగ్యకరమైన సామాజిక వాతావరణాన్ని నెలకొల్పడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి మద్యపాన రహిత వాతావరణం ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు సభ్యులు యాటకాల రంజిత్ కుమార్, 8వ వార్డు సభ్యులు కొంగొండ హేమంత్ కుమార్, బత్తిని సుమన్, తాళ్లపల్లి చిరంజీవి, గీకురు అశోక్, యాటకాల సుమన్, తాళ్లపల్లి బాలకృష్ణ, తాళ్లపల్లి హరీష్ తదితరులు పాల్గొన్నారు. జయగిరి గ్రామాన్ని సంపూర్ణ మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు శాఖతో పాటు అన్ని వర్గాల ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. జయగిరి తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గ్రామాలకు సైతం ఆదర్శంగా నిలవాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.

# రేపు వాహనాల వేలం

- మండల ప్రజలు వినియోగించుకోవాలి
- గూడూరు ఎక్సైజ్ సీఐ భిక్షపతి

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



కోడూరు మండలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో బుధవారం రోజున ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ గూడూరు నందు వివిధ కేసులలో సీజ్ చేయబడిన వాహనాలకు మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్ సమక్షంలో బహిరంగ వేలం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది . ఈ వాహనాలు వివిధ కేసులలో అనగా నల్ల బెల్లం, నాటు సారాయి రవాణా కేసులలో పట్టుబడినటువంటి రెండు ఆటోలు, 40 ద్విచక్ర వాహనాలు కలవు. వేలంలో పాల్గొనదలచిన వారు స్వతహాగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ గూడూరు నందు ఉంచబడినటువంటి వాహనాలను చూసి, బహిరంగ వేలంలో పాల్గొనగలరు. వాహనాలకు వేలంలో పాల్గొనే వారు బుధవారం ఉదయం 10 గంటల లోపు చెల్లించి వేలంలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని ఈ చక్కటి అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని గూడూరు ఎక్సైజ్ సీఐ బిక్షపతి ప్రకటనలో తెలిపారు



# ప్రజా సమస్యల పరిష్కారమే పోలీసుల ప్రధాన లక్ష్యం

- భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్
- జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజాదివాస్ నిర్వహణ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ప్రజాదివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన పిర్యాదుదారుల నుండి మొత్తం 15 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.



# కాళేశ్వరం అటవీ ప్రాంతంలో గుప్తనిధుల వేట

- ఇద్దరు వ్యక్తుల అరెస్ట్, ఎలక్ట్రానిక్ పరికరాల స్వాధీనం
- 6 నెలలుగా గుప్త నిధుల కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలోని సిసిఎస్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో కాలేశ్వరం అటవీ ప్రాంతంలో గుప్తనిధుల కోసం అన్వేషణ జరుపుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా గత ఆరు నెలలుగా కాలేశ్వరం పరిసర ప్రాంతాల్లో గుప్తనిధుల కోసం అన్వేషిస్తున్నట్లు వారు వెల్లడించారు. వారి వద్ద నుంచి గుప్తనిధుల అన్వేషణకు ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంజారపు వెంకటరమణ ప్రసాద్, టీచర్స్ కాలనీ, ఆదిలాబాద్, హన్మకొండ సుధానగర్ కు చెందిన వలబోజు శ్రీనివాస్ ను అరెస్టు చేసినట్లు సీసీఎస్ సీఐ రమేష్ తెలిపారు. గుప్తనిధుల పేరుతో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374